క్లుప్తంగా

హనుమాన్ శోభాయాత్ర విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 22న పట్టణంలో జరగనున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని నారాయణ సేన నగర సంకీర్తన బృందం పిలుపునిచ్చింది. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో హనుమాన్ శోభాయాత్రపై సోమవారం నిర్వహించిన సమావేశంలో సంకీర్తన బృందం సభ్యులు మాట్లాడారు. హనుమాన్ శోభాయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నారాయణ సేన నగర సంకీర్తన బృందం సభ్యులు తదితరులు ఉన్నారు.

వీహెచ్‌పీ అమరావతి ఖండ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



అమరావతి: విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) అమరావతి ఖండ అధ్యక్షుడిగా మండల పరిధిలోని మునగోడు గ్రామానికి చెందిన మేకల వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సమరసత విభాగం అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణ నేతృత్వంలో సరస్వతి శిశు విద్యా మందిర్‌లో సోమవారం విశ్వహిందూ పరిషత్ అమరావతి ఖండ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ ఎంపికలో అమరావతి ఖండ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడిగా మేకల వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మద్ది ఆనంద్, మాత శక్తి ప్రముఖ్‌గా పారేపల్లి పుష్పలత కార్యవర్గ సభ్యులుగా శంకరమంచి శ్రీనివాస్, మల్లాల విశ్వనాథ్, నెప్పలి రామ్ కళ్యాణ్ చక్రవర్తి, నారదాసు నరసింహారావు, మల్లాల భార్గవ్ తేజ్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా చిరుమామిళ్ల గోపికృష్ణ మాట్లాడుతూ దేవాలయాల పరిరక్షణ, హిందూ ధర్మ సంరక్షణ కొరకు కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోలా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రవీణ్



అచ్చంపేట: స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితజాతి ముద్దుబిడ్డ.. అనేక సంస్కరణలు చేశారని, ఆయనను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన అడుగుజాడల్లో నడవాలని చెప్పారు. ఆయన వెంట పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు. మండలంలోని తాళ్లచెరువులో బాలయేసు దేవాలయం నిర్మించి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న వజ్రోత్సవ వేడుకలు మూడవరోజు ఉత్సవాలలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఫాదర్ పుట్టి అంతోనిరాజు ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మొదటి విడత పాఠ్యపుస్తకాల పంపిణీకి సిద్ధం



రెంటచింతల: రెంటచింతల మండలానికి మొదటి విడతగా 11,800 టెస్ట్‌బుక్స్ వచ్చినట్లు ఎంఈఓ-2 వై.శివనాగేశ్వరరావు సోమవారం తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, జెడ్పీ, కస్తూరిబా, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు కలుపుకుని మొత్తం 3,480 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేయాల్సి ఉందని చెప్పారు. 2025-2026 విద్యాసంవత్సరం ప్రారంభ సమయానికి రెండో విడతగా మరో 4,700 టెస్ట్‌బుక్స్ రావాల్సి ఉందని పేర్కొన్నారు. సకాలంలోనే హెచ్‌ఎంల ద్వారా ఆయా పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



దాచేపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ పి.భాస్కర్ హెచ్చరించారు. మండలంలోని పొందుగల రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. తెలంగాణ నుంచి ఏపీకి వచ్చే వాహనాలలో సోదాలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమని, తాగి వాహనాలు నడిపి ప్రమాదాలబారిన పడవద్దని సీఐ సూచించారు. వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు అన్ని పత్రాలు ఉండేలా చూసుకోవాలన్నారు. తనిఖీల్లో ఎస్సై జి.పాపారావు ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే..!

- ఏళ్లుగా పరిష్కారం కాని సమస్య
- నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ముందుకు సాగని పనులు

అధ్వానంగా ఉన్న నకరికల్లు ప్రధాన రహదారి



నకరికల్లు పాతూరు రోడ్డులోని మసీదు సెంటర్‌లో రోడ్డు దుస్థితి



అధ్వానంగా నకరికల్లు ప్రధాన రహదారి పరిస్థితి

నకరికల్లు: మండల కేంద్రమైన నకరికల్లులో ప్రధాన రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారికి ఇరువైపులా విస్తరించి ఉన్న నకరికల్లులో పాతూరు రోడ్డు పేరుతో గ్రామమంతా కలిపే ప్రధాన రహదారి ఉంది. ఇదే రహదారి తండాలను కూడా కలుపుతుంది. గత కొన్నేళ్లుగా ఈ రోడ్డు పరిస్థితి అధ్వానంగా తయారయింది. గతంలో స్పీకర్‌గా కోడెల శివప్రసాదరావు పని చేస్తున్న కాలంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఏళ్ల గడుస్తున్నా రోడ్డు నిర్మాణానికి మాత్రం నోచుకోలేదు. రోడ్డంతా రాళ్లు లేచి గోతులమయంగా తయారయింది. దీంతో ప్రధాన రహదారి ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. కొద్దిపాటి వర్షానికి రోడ్డంతా వర్షపు నీరు నిలవడంతో చిత్తడిచిత్తడిగా మారిపోతుంది. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఏ వీధికి రాకపోకలు సాగించాలన్నా ప్రధాన రహదారి అయిన పాతూరు రోడ్డుకు రాకతప్పదు. అయినప్పటికీ రోడ్డు దుస్థితితో వాహనదారులు సైతం గల్లీల్లో గుండా వెళ్లాల్సి వస్తుంది. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో మురుగునీరు సైతం రోడ్లపైకి చేరుతుంది. ప్రధాన రహదారిని తక్షణం నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర రహదారిపైనే మురుగునీరు



అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై నుంచి పారుతున్న మురుగునీరు

అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపైకి నరసరావుపేట బస్టాప్ సెంటర్‌లో చిన్నపాటి వర్షానికే నీరు వచ్చి చేరుతుంది. రోడ్డుపైనే వ్యర్థాలు వేస్తుండడంతో ఆ నీరంతా కలుషితమై దుర్వాసన వెదజల్లుతుంది. వర్షం పడినప్పుడల్లా ఇదే తంతుగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా బ్యాంకు బజారుకు వెళ్లే రోడ్డు వైపు డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో రోడ్డుపై పడిన వర్షపునీరు రోడ్డుపైనే నిలిచిపోతుంది. దాదాపు 10 రోజుల తర్వాత గానీ నీరు పోవడం లేదు. దీంతో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోంది. ఇదే సమస్య కొనసాగుతున్నా డ్రైనేజీ నిర్మించి హైవే పైకి మురుగునీరు రాకుండా చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఆయా శాఖల అధికారులు స్పందించి నకరికల్లు గ్రామంలోని పాతూరు ప్రధాన రహదారిని త్వరితగతిన నిర్మించాలని, హైవేపై మురుగునీరు చేరకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- క్రోసూరులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో మినీ మహానాడు



మినీ మహానాడు కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధ్యక్షతన క్రోసూరు మార్కెట్ యార్డులో మినీ మహానాడు కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, నియోజకవర్గ పరిశీలకుడు నల్లపాటి రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అన్ని విధాలుగా పెదకూరపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి టీడీపీ పాటు పడుతుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గం రాజధాని అమరావతిలో భాగస్వామ్యంగా ఉండడం సంతోషకరమని ఎమ్మెల్యే అన్నారు. ముందుగా ఆపరేషన్ సిందూర్‌లో మన దేశ పోరాటపటిమ, సత్తా చాటిన దేశ సైనికులకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కార్యకర్తలు, నాయకులు వెన్నా సాంబశివరెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డికి అభినందనలు



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెం ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఏఎస్‌కే వీరంగారెడ్డిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, నాయకులు ఆయన గృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. పార్టీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఎంజీఎం రామలింగారెడ్డి, మాజీ సర్పంచ్ మధిర సీతమ్మ, నాయకులు రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ పీలా గాయత్రిలక్ష్మణ్, అన్నపురెడ్డి సాయిరెడ్డి, బ్రహ్మారెడ్డి, రామిరెడ్డిలు అభినందించారు.

'రెడ్‌బుక్'తో భయాందోళనకు గురి చేస్తున్నారు..

వైఎస్సార్ సీపీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి సింగరయ్యయాదవ్

దాచేపల్లి: రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేస్తూ ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగాల సింగరయ్య యాదవ్ అన్నారు. నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అరాచకాలకు తెగబడిందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు, పాత్రికేయులపై ఇష్టానుసారంగా కేసులు పెట్టి జైలుపాలు చేస్తుందని, కూటమి అరాచకాలపై ప్రశ్నించే గొంతులను అణచివేస్తుందని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వం లేని స్కాములు సృష్టించి, కక్ష సాధింపులకు దిగుతుందని, ఘాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి అక్రమ అరెస్టుని ఆయన ఖండించారు.

దళిత విద్యార్థిపై దాడి దారుణం

సత్తెనపల్లి: తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌ను విచక్షణా రహితంగా కొట్టి.. మూత్రం తాగించడం దారుణమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీటెక్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్ కులం పేరుతో దూషించొద్దని అన్నందుకు హాకీ స్టిక్‌లు, రాడ్లతో అమానుషంగా దాడి చేయడాన్ని ఖండించారు. దళితుడిగా పుట్టడమే ఆ విద్యార్థికి శాపంగా పరిణమించిందని, సీనియర్ అన్న గౌరవం కూడా లేకుండా కులం పేరుతో దూషించడం జూనియర్ యశ్వంత్‌నాయుడు కు తగదని, రౌడీ షీటర్లతో కలిసి విచక్షణా రహితంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. జేమ్స్‌ను తిరుచానూరు సమీపంలోని ఒక లాడ్జిలో బంధించి వేధింపులకు గురి చేశారన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వెళితే పోలీసు సిబ్బంది నామ మాత్రంగా ఫిర్యాదును తీసుకుని, జేమ్స్‌ను ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించడం జరిగిందన్నారు. అధికార పార్టీ అండతో దుర్మార్గంగా జేమ్స్‌ని కొట్టి హింసించిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సేవాదళ్ నాయకులు సిద్దెల మోహన్‌రావు, దళిత నాయకులు కొరబండి ఆంథోని, జిల్లెళ్ల పాల్‌రాజు, కోటపాటి సాంబశివరావు తదితరులు ఉన్నారు.

నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

రెంటచింతల: నూతన రేషన్(బియ్యం) కార్డులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ దొప్పలపూడి మేరీ కనకం కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు 366 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా మరో 323 మంది నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందచేసినట్లు తెలిపారు. ఒంటరి మహిళ, ఆశ్రమాల్లో ఉన్నవారికి కూడా బియ్యం కార్డుల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. కొత్త రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల చేర్పు,ఆధార్ సీడింగ్ తదితరాలకు గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఆదర్శమూర్తి పుచ్చలపల్లి సుందరయ్య

సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పుచ్చలపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సత్తెనపల్లి: దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శమని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో సోమవారం జరిగిన సుందరయ్య వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల అధ్యక్షత వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ దేశంలో దోపిడీ లేని సమ సమాజ స్థాపనకు కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించి తన జీవితాన్ని త్యాగం చేసిన ఆదర్శ మూర్తి పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య వ్యవసాయ కార్మిక సంఘాన్ని నిర్మించి కూలి పోరాటాలు నిర్వహించారన్నారు.

సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మనమందరం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం పలు భాషలకు చెందిన వారు ఒక ప్రాంతంలో ఉండటంతో పరిపాలన సాగటం కష్టంగా ఉంటుందని భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండును మొట్టమొదటిగా ముందుకు తీసుకు వచ్చింది కామ్రేడ్ సుందరయ్య అని అన్నారు. దున్నే వానికే భూమి అనే నినాదంతో నైజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం చేశారన్నారు. సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభలో సీపీఎం నాయకులు కె.శివ దుర్గారావు, ఎ.వీరబ్రహ్మం, జె.రాజ్ కుమార్, ఎం.హరిపోతురాజు, పి.శేషు, గుంటూరు మల్లేశ్వరి, గద్దె ఉమాశ్రీ, పి.సూర్య ప్రకాష్ రావు, షేక్ సైదులు, పి.ప్రభాకర్, పి.రామారావు, డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శప్రాయుడు సుందరయ్య

అమరావతి: శ్రామిక, పీడిత వర్గాల ఆశాజ్యోతి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అమరావతి శాఖ కార్యదర్శి సయ్యద్ మొహిద్దీన్ వలి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య తుదిశ్వాస వరకు పేద ప్రజల కోసం సామ్యవాద సమ సమాజం కోసం నిస్వార్థంగా నిరాడంబరంగా జీవించారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి పది లక్షల ఎకరాల భూమిని రైతు కూలీలకు పంపిణీ చేయటానికి కారకుడయ్యారన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన సుందరయ్య ఆశయాలకు అనుగుణంగా నేటి యువత పనిచేయాల్సిన అవసరముందన్నారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందూరి వెంకటేశ్వరరాజు, నాగులమీరా, మధు ఏషియా తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం కాపాడాలంటూ అర్జీ



ఆక్రమణకు గురవుతున్న శ్మశాన వాటిక స్థలం

క్రోసూరు: మండలంలోని పెరికపాడు గ్రామంలో ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి సంబంధించిన శ్మశాన వాటిక స్థలంను పక్కనే ఉన్న పొలం వారు ఆక్రమించుకుంటున్నారని గ్రామ ఎస్సీలు కొంత మంది సోమవారం తహసీల్దార్ వీవీ నాగ రాజుకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను కలుసుకున్న వారిలో జడ సుబ్బు మాట్లాడుతూ గ్రామ ఎస్సీ కాలనీలో 100 కుటుంబాలు నివసిస్తున్నాయని, ఎవరైనా చనిపోతే మట్టి కార్యక్రమం పూర్వీకుల నుంచి దొడ్లేరు-పెరికపాడు మధ్య అలుగు దగ్గర ప్రభుత్వ పోరంబోకు భూమి(సుమారు 0.75 సెంట్లు పైనే)లోనే నిర్వహించడం జరుగుతుందన్నారు. అయితే పక్కనే ఉన్న పొలం వారు శ్మశాన స్థలాన్ని కొంచెం కొంచెం ఆక్రమించుకుని, రాళ్లు శ్మశాన స్థలంలోకి నెట్టారని తెలిపారు. ప్రస్తుతం శ్మశాన స్థలం 0.20 సెంట్లు మాత్రమే ఉందని, అది కూడా కొంత రాతి భూమి అని తెలిపారు. ఇటీవల ఒకరు ఇద్దరు చనిపోయినప్పుడు మట్టి కార్యక్రమం నిమిత్తం తవ్వినప్పుడు గతంలో పూడ్చిపెట్టిన అవశేషాలు బయటపడుతున్నాయని అన్నారు. కావున ప్రభుత్వం తగు విధంగా చర్యలు తీసుకొని ఆక్రమణ నుంచి శ్మశాన భూమిని కాపాడాలని కోరారు. అర్జీ అందజేసిన వారిలో మురికిపూడి ఇశ్రాయేలు, నందిపాటి ఏసోబు, జడ రామారావు, సిద్దెల దిలీప్, మంద సదేశ్వరరావు, జడ అశోక్ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రవిబాబు

అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల వేతనాలను వెంటనే చెల్లించాలని ఈ నెల 20వ తేదీ గ్రామ సచివాలయాలు, మండల కేంద్రాల్లో జరగనున్న నిరసన కార్యక్రమాల్లో ఉపాధి హామీ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు కోరారు. సోమవారం మండల పరిధిలోని మునుగోడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు తగ్గించటం వల్ల సకాలంలో వేతనాలు అందకపోవటంతో పాటుగా వేసవిలో మజ్జిగ, మంచినీరు, పలుగు, పార అలవెన్సులు లేకుండా పోయాయన్నారు. పెరిగిన కుటుంబ అవసరాలకు వ్యవసాయ కార్మికులు వారం వారం చెల్లింపులు చెల్లించాల్సి ఉండగా ఆరు వారాలుగా వేతనాలు అందకపోతే ఏ విధంగా కుటుంబాల అవసరాలు తీరతాయన్నారు. మేట్‌ల వ్యవస్థ అమలు కాకపోవటంతో వివిధ పనులకు ఉమ్మడిగా నంబర్లు ఇవ్వటం వల్ల ఒకే చోటికి ఉపాధి హామీ కూలీలు వచ్చి ఆన్‌లైన్ హాజరు పట్టికలో ఫొటోలు తీసుకోవాలంటే గంటల తరబడి జాప్యం జరుగుతుందన్నారు. ప్రభుత్వ మేట్‌ల వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని 20వ తేదీన గ్రామ సచివాలయాలు, మండల కేంద్రాల్లో జరగనున్న నిరసన కార్యక్రమాల్లో ఉపాధి హామీ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు సయ్యద్ మొహిద్దీన్, మేట్‌లు షేక్ గాలి సాహెబ్, నేలపాటి జయ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, షేక్ రఫీ, బంకా మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



అంకిత్‌పాల్‌ను సత్కరిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

సత్తెనపల్లి: విద్యార్థులు విద్యతోపాటు ఇతర రంగాలపై పట్టు సాధిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని లోక్‌జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న పత్తిపాటి అంకిత్‌పాల్ విజయవాడలోని హలెల్ మ్యూజిక్ ద్వారా సంగీతం నేర్చుకుని 2024 డిసెంబరు 1న 18 దేశాల్లోని 1,046 మందితో స్వరాలు ఆలపించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించి ఇటీవల ధ్రువీకరణ పత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అంకిత్‌పాల్‌ను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించిన అంబేడ్కర్, అబ్దుల్ కలాంలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రుల అభిప్రాయాలు పిల్లలపై రుద్దకుండా వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. గిన్నిస్ బుక్ రికార్డు సాధించన అంకిత్ పాల్ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం అంకిత్ పాల్‌ను అభినందించి ఘనంగా సన్మానించి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో నాయకులు మహంకాళి వెంకట్రావు, కొండా బాబు, పత్తిపాటి కిరణ్‌బాబు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముప్పాళ్ళ: విద్యుత్ ఉప కేంద్రంలో నూతన 11 కేవీ బ్రేకర్, లైన్స్ మరమ్మతులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 20వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ జి.సుచరిత సోమవారం తెలిపారు. మండలంలోని గోళ్ళపాడు, కుందురువారిపాలెం, తురకపాలెం, కొంకావారిపాలెం, లంకెలకూరపాడు, పలుదేవర్లపాడు, నార్నెపాడు, బొల్లవరం, దమ్మాలపాడు, రుద్రవరం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.



కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారిపై సత్తెనపల్లిలో కమ్ముకున్న చీకట్లు

వెలగని దీపాలు.. కమ్ముకున్న చీకట్లు

పట్టణంలో పూర్తి స్థాయిలో వీధి దీపాలు వెలగక రాత్రి పూట అడుగడుగునా అంధకారం రాజ్యమేలుతోంది. కొన్నాళ్లుగా ఇదే తంతు ఉన్నా మరమ్మతులకు పురపాలక యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదు. వార్డుల్లో సంగతి సరే. కనీసం కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారిలోని సత్తెనపల్లిలో, రైల్వే స్టేషన్ రోడ్‌లో సెంట్రల్ లైటింగ్ వీధి దీపాలు సైతం సక్రమంగా వెలగడం లేదు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా రహదారుల్లో వాహనాల వెలుగులోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. రైల్వే స్టేషన్ రోడ్‌లో రైళ్ల నుంచి దిగిన ప్రయాణికులు పట్టణంలోని ప్రధాన సెంటర్‌కు చేరుకోవడానికి ఎక్కువగా ద్విచక్ర వాహనాలు ఉపయోగిస్తుండగా కొందరు నడిచి వెళుతుంటారు. ఆ క్రమంలో భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్ వీధి దీపాలు పరిశీలించి సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

\- సత్తెనపల్లి

- **జూదరుల అరెస్టు**

పిడుగురాళ్ల: పేకాటాడుతున్న వారిపై దాడి ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. సీఐ వెంకట్రావు తెలిపిన వివరాలు.. కరాలపాడుకు వెళ్లే దారిలో పొలాల వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు చేసి 15 మందిని అరెస్ట్ చేసి, రూ.1.54 లక్షలు స్వాధీనం చేసుకున్నామని సీఐ చెప్పారు.